ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

1



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

ఆదివారం 4 మే 2025

జిల్లా పోలీసుశాఖలో 74 మంది బదిలీ

బెలగాం, మే 3(ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖలో 74 మంది పోలీస్ సిబ్బందికి స్థానచలనం కల్పించినట్లు ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లో గత నాలుగు నుంచి ఐదేళ్ల పైబడి పనిచేస్తున్న ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లను బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. వారిలో నలుగురు ఏఎస్‌ఐలు, 24 మంది హెచ్‌సీలు, 46 మంది పీసీలు ఉన్నారని తెలిపారు. వారంతా త్వరలో బదిలీ అయిన పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించ నున్నారని చెప్పారు.

నిధుల్లేవ్.. నీరూ లేదు



గొట్టివలస రహదారికి ఆనుకుని ఏర్పాటు చేసిన తొట్టెలో నీరు లేని దృశ్యం

- తొట్టెల్లో నీరు కరువు
- వాటి నిర్మాణాలు పూర్తయినా విడుదల కాని నిధులు
- వేతనాల కోసం ఎదురుచూస్తున్న ఉపాధి కూలీలు

గరుగుబిల్లి, మే 3(ఆంధ్రజ్యోతి):

వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చడానికి గ్రామాల్లో నిర్మించిన తొట్టెల్లో నీరు కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో 'పల్లె పండుగ' పేరుతో ఉపాధి హామీ పథకం కింద పనులు పూర్తి చేసినా.. నీరు నింపడంపై దృష్టి సారించడం లేదు. దీంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా పరిధిలో నీటి తొట్టెల నిర్మాణం దాదాపుగా పూర్తయినా నిధులు మాత్రం విడుదల కాలేదు. మరోవైపు ఉపాధి వేతనదారులు కూడా వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు.



సాంబన్నవలసలో నీటితొట్టె ఇలా..

ఇదీ పరిస్థితి..

- జిల్లాలో 2.29 లక్షల మూగ జీవాలు, 47 వేల నల్ల జాతి దున్నలు, 2.07 లక్షల గొర్రెలు, 1.73 లక్షల మేకలు ఉన్నాయి. ఈ మేరకు 15 మండలాల్లో 411 నీటి తొట్టెలు నిర్మాణాలకు అనుమతులు మంజూరయ్యాయి. ఒక్కొక్క తొట్టె నిర్మాణానికి రూ. 30 వేలు మంజూరు చేశారు. పనుల బాధ్యతను పంచాయతీల పరిధిలోని వ్యక్తులకు అప్పగించారు. ఇందులో వేతనంగా రూ. 5,100, సామగ్రికి రూ. 24,100 వెచ్చించాల్సి ఉంది. అయితే వేతనదారులకు పని కల్పించ లేదు. గ్రామస్థాయి లోని ప్రతి నిధులు నిర్మాణాలకు చర్యలు చేపట్టారు.
- ఈ నెల 9 వరకు గడువు ఉన్నా.. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన నీటి తొట్టెల పనులు పూర్తికావచ్చాయి. రహదారులకు ఆనుకొని ఉన్న చెరువులు, ట్యాంకర్లు, బోరుబావుల పరిధిలో నీటి తొట్టెల నిర్మించారు. అయితే నీటి సౌకర్యం లేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సి ఉంది. తొట్టెల్లో నీటిని నింపే బాధ్యతను స్థానిక పంచాయతీలకు అప్పగించినా.. పట్టించుకునే వారే కరువయ్యారు.
- 411 నీటి తొట్టెల నిర్మాణాలకు రూ. 1.23 కోట్లు మంజూరు చేశారు. అయితే నిర్మాణం పూర్తయినా నేటికీ నిధులు విడుదల కాలేదు. ఒకవైపు నీటి తొట్టెలు, మరోవైపు ప్రహరీల నిర్మాణాలతో పాటు పలు రకాల అభివృద్ధి పనులు ఉపాధిలోనే నిర్వహించారు. 15 మండలాల పరిధిలో 323 ప్రహరీలకు గాను సుమారు 235కు పైగా పూర్తికావచ్చాయి. రూ.2.47 కోట్లు బిల్లులు మంజూరు కావల్సి ఉంది.
- మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన పనులకు రూ.12 కోట్ల వరకు బకాయిలున్నాయి.
- వేతనదారులకు సంబంధించి 11 వారాలకు గాను 4 వారాలకు సంబంధించిన చెల్లింపులు జరిగాయి. మరో ఏడు వారాలకు గాను సుమారు రూ.20 కోట్ల పైబడి వేతనాలు అందాల్సి ఉంది.

నమోదు చేయలే..

నీటి తొట్టెల నిర్మాణాల చెల్లింపులకు సంంధించి ఎంబుక్‌లో నమోదు చేయలేదు. ప్రహరీలకు సంబంధించి ఉపాధి ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు ఇప్పటికే నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. అయితే స్లాట్ ఓపెన్ కాకపోవడంతో నిధుల కోసం ఓవైపు కాంట్రాక్టర్లు, మరోవైపు వేతనదారులు గత రెండు నెలలుగా ఎదురుచూస్తున్నారు.

పంచాయతీలదే బాధ్యత..

నీటి తొట్టెల బాధ్యత స్థానిక పంచాయతీలదే. తొట్టెలకు ఆనుకుని నీరు నిల్వ లేకుంటే వేరే ప్రాంతం నుంచి నీటిని తెచ్చి తొట్టెలను నింపాల్సి ఉంది. కుళాయిలు ఉన్న ప్రాంతాల నుంచి నీటిని సరఫరా చేయాలి. అలా చేయకుంటే పంచాయతీలపై చర్యలు తప్పవు. తొట్టెల నిర్వహణ బాధ్యత ఉపాధి క్షేత్ర సహాయకులపై ఉంది. పర్యవేక్షణ కొరవడితే చర్యలు తప్పవు. వాటి నిర్మాణాలకు సంబంధించిన నిధులు వారం రోజుల్లో జమకానున్నాయి. త్వరలోనే ఉపాధి కూలీలకూ వేతనాలు చెల్లిస్తాం.

-జి.శ్రీహరిరావు, ఏపీడీ, డ్వామా, సీతంపేట క్లస్టర్

ఉపాధి బకాయిలు రూ. 100 కోట్లు

- మెటీరియల్ కాంపోనెంట్‌తో అభివృద్ధి పనులు
- నెలలు గడుస్తున్నా చెల్లింపులు జరగని వైనం
- పేరుకుపోతున్న బిల్లులు
- అప్‌లోడ్ చేస్తున్నా.. మంజూరు చేయని కేంద్రం
- తలలు పట్టుకుంటున్న వెండర్‌దారులు
- సమాధానం చెప్పలేకపోతున్న అధికారులు

పార్వతీపురం, మే 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్‌తో జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులకు చెల్లింపులు జరగడం లేదు. కొద్ది నెలలుగా బిల్లులు మంజూరు కావడం లేదు. పనుల ప్రాప్తికి అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నా.. కేంద్రం నుంచి నిధులు రావడం లేదు. దీంతో రూ.100 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు రూపాయి కూడా చెల్లించక పోవడంతో వెండర్‌దారులు తలలు పట్టుకుంటున్నారు. తాజాగా మంజూరైన పనులు చేపట్టేందుకు కూడా ముందుకు రావడం లేదు. ఇప్పటికే అప్పులు చేసి మరీ సీసీ, బీటీ రోడ్లు, సీసీ కాలువలు, ప్రహరీలు తదితర నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపట్టారు. వాటి పనులు వేగవంతంగా పూర్తిచేయించడంలో జిల్లా అధికారులు సైతం సఫలీకృతులయ్యారు. అయితే ఈ ఏడాది మార్చి 31 నాటికి పూర్తిస్థాయిలో బిల్లుల చెల్లింపులు కాకపోవడంతో వెండర్‌దారులు తమ అప్పులకు వడ్డీలు చెల్లించకలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వాస్తవంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన పనులకు వెంట వెంటనే బిల్లులు చెల్లింపులు చేపట్టారు. అంతేగాకుండా గత వైసీపీ ప్రభుత్వ కాలంలో చేపట్టిన నిర్మాణాలకూ బిల్లులు చెల్లించారు. దీంతో కాంట్రాక్టర్లు పోటాపోటీగా అభివృద్ధి పనులు చేపట్టారు. కానీ కొద్ది నెలలుగా బిల్లులు మంజూరు కాకపోవడంతో వారు లబోదిబో మంటున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మరోవైపు రాష్ట్రస్థాయి అధికారులు జిల్లా యంత్రాంగంపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. దీంతో వారు నిర్మాణాలపై దృష్టి సారిస్తున్నా.. కాంట్రాక్టర్లు సహకరించడం లేదు. చెల్లింపులు లేకపోతే ఎలా పనులు చేస్తామని వారు ప్రశ్నిస్తుండడంతో ఉపాధి సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులు, కాంట్రాకర్లకు సమాధానం చెప్పలేక.. లక్ష్యాన్ని ఎలా నెరవేర్చాలో తెలియక నానా అవస్థలు పడుతున్నారు.



మంజూరైన వెంటనే చెల్లింపులు

ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన పనులకు త్వరలోనే బిల్లుల చెల్లింపులు జరుగుతాయి. త్వరలోనే నిధులు మంజూరవుతాయి. ఉపాధి వేతనదారుల చెల్లింపులు చాలా వరకు పూర్తయ్యాయి.

- రామచంద్రరావు, డ్వామా పీడీ,

నవ్వండి.. నవ్వించండి

- హాస్యంతో ఆరోగ్యం పదిలం
- సమస్యలన్నీ దూరం
- నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం



విజయనగరం/గరుగుబిల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాంత్రిక జీవితంలో జనానికి మనసారా నవ్వుకునే తీరిక లేకుండా పోయింది. ఫలితంగా తీవ్రమైన మానసిక ఒత్తిడి, రక్తపోటు, ఇతరత్రా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మనస్ఫూర్తిగా నవ్వేవారి శరీరంలో సమతుల్యమైన మార్పులు చోటు చేసుకొని, రక్త ప్రసరణ జరిగి మంచి ఆరోగ్యానికి దోహద పడుతుంది. రోజుకు కనీసం 30 నిమిషాలైనా మనసారా నవ్వకపోతే అనారోగ్య సమస్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే నవ్వులో పాజిటివ్ భావాలతో పాటు హీలింగ్ ప్రక్రియ కూడా ఉంది. అందుకే నగరాల్లో ప్రత్యేకంగా లాఫింగ్ క్లబ్‌లు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. హాస్యం మన సమస్యల్ని దూరం చేస్తుంది. హాయిగా నిద్ర పట్టేందుకు ఉపకరిస్తుంది. నవ్వడం అనేది ఓ ఆరోగ్య సూత్రం. అందుకే మీరు కడుపుబ్బ నవ్వండి.. అందర్నీ నవ్వించండి. ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని హాస్య నటులు, మిమిక్రీ ఆర్టిస్టుల గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

నవ్వుల దామోదర్

గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన బోను దామోదర్‌నాయుడు హాస్యంతో పలువురిని ఆకట్టుకుంటూ మానసిక ప్రశాంతత అందిస్తున్నారు. గత 25 ఏళ్లుగా వంద షార్ట్ ఫిలిమ్స్, 62 సినిమాల్లో పలు పాత్రలను పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. దామోదర్ వైజాగ్‌లో నవ్వుల వెబ్ సిరీస్ ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటీలో డైరెక్టర్ డిప్లొమాలో గోల్డ్ మెడల్‌ను సాధించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ నటనపై దృష్టి సారించడంతో హాస్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. పరిసర ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించి నవ్వుల దామోదర్‌గా గుర్తింపు పొందారు. వీటితో పాటు 200లకు పైగా మేజిక్ షోలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 100కు పైగా కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీక దీపం, మామగారు సీరియల్స్‌లో న్యాయవాదిగా, ఘర్షణ సీరియల్‌లో లెక్చరర్‌గా నటించారు. అల్లూరి సీతారామరాజు, అన్నవరం, దసరా వంటి చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు పొందారు. పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ సహాయ సహకారాలు అందిస్తున్నారు.



హాస్య పాత్రలో దామోదర్

పక్కాగా ఫీవర్ సర్వే: డీఎంహెచ్‌వో

గుమ్మలక్ష్మీపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో పక్కాగా ఫీవర్ సర్వే చేపట్టాలని, మలేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు ఆదేశించారు. శనివారం తాడికొండ పీహెచ్‌సీ, గుమ్మలో స్ప్రేయింగ్‌ను పరిశీలించారు. ఈ సంద ర్భంగా వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పీహెచ్ సీలో వైద్యసేవలపై ఆరా తీశారు. మలే రియా పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నిరంతరం అప్రమ త్తంగా ఉండాలన్నారు. దోమల నివారణకు చేపడుతున్న ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్ గ్రామాల్లో పూర్తిస్థాయిలో జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. స్ప్రేయింగ్ జరగబోయే గ్రామాలను సబ్ యూనిట్ అధికారులు ముందస్తుగా తెలియజేయాలన్నారు. దీనిపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రిలో సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉంటూ సేవలందించాలని తెలిపారు. వైద్య సేవలపై రోగుల అభిప్రాయాలు స్వీకరించాలన్నారు. గుమ్మలో ఇంటింటికీ దోమల మందు పిచికారీ చేస్తున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో

తోటపల్లి నుంచి సంతోషపురం

- ఏనుగుల సంచారంతో ప్రజల బెంబేలు

గరుగుబిల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలాన్ని గజరాజులు వీడడం లేదు. కొద్దిరోజులుగా నుంకిలో సంచరించిన ఏనుగులు శుక్రవారం తోటపల్లి పంప్‌హౌస్ ప్రాంతానికి చేరుకున్న విషయం తెలిసిందే. ఆ ప్రాంతంలో పంటలు, వ్యవసాయ పరికరాలను ధ్వంసం చేసి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగి ల్చాయి. తాజాగా శనివారం ఏనుగులు తోటపల్లి నుంచి సంతోష పురానికి చేరుకు న్నాయి. దీంతో ఆ గ్రామానికి చెందిన రైతులు భయాందో ళన చెందు తున్నారు. అరటి, పామా యిల్, నువ్వు , వరి పంటలను ఏనుగులు నాశనం చేయకముందే వాటిని తరలించే చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామం వైపు గజరాజుల గుంపు వెళ్లకుండా అటవీ సిబ్బందితో పాటు ట్రాకర్లు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. రైతులు ఒంటరిగా పొలాల వైపు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.



గాలి వీస్తే విద్యుత్ కట్

- భామినిలో నిత్యం అంధకారం
- సెల్‌ఫోన్ వెలుగుల్లో అధికారుల విధులు

4 లో

ఈదురుగాలుల బీభత్సం

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



మక్కువ: సువర్ణముఖి నది వంతెన వద్ద నేలకూలిన చెట్టు

15 రోజులుగా పనిచేయట్లే..

- జిల్లా ఆసుపత్రిలో నిలిచిన సీటీ స్కానింగ్ సేవలు
- రోగులకు తప్పని ఇబ్బందులు

బెలగాం, మే3 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సీటీస్కాన్ సేవలు నిలిచిపోయాయి. గత 15 రోజులుగా అది పనిచేయడం లేదు. దీంతో ఆ గదిని మూసి వేయగా.. రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవంగా జిల్లా ఆసుపత్రి నిత్యం రోగులతో కిటకిలాడుతుంది. రోజూ వందలాది మంది వస్తుంటారు. మెదడు, ఊపిరితిత్తులు, క్షతగాత్రులు, పొట్టలో సమస్యలు ఉన్న వారికి సీటీ స్కానింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే కొద్దిరోజులుగా అది పనిచేయక పోవడంతో ఆయా రోగులు నానా అవస్థలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ఆసుపత్రులకు తరలివెళ్లాల్సి వస్తోంది. ఒక్కొక్కరూ రూ. 3వేల నుంచి రూ.4 వేల వరకూ చెల్లించాల్సి వస్తోంది. మొత్తంగా పేదలు, గిరిజన రోగులపై ఆర్థిక భారం పడుతోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి త్వరిత గతిన సీటీ స్కానింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగశివజ్యోతిని వివరణ కోరగా.. 'ఈ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశాం. సింగపూర్ నుంచి పార్ట్ రావల్సి ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.' అని తెలిపారు.



పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో మూసి ఉన్న సీటీస్కాన్ గది

శ్యామలాంబ పండగకు ఏర్పాట్లు

- సాలూరులో ముస్తాబవుతున్న ఆలయం
- చురుగ్గా విద్యుత్ పనులు
- ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు

4 లో

8 నుంచి తోటపల్లిలో కోదండరాముని కల్యాణోత్సవాలు



2 ఆంధ్రజ్యోతి నవ్య కుటుంబ కదంబం 4 మే 2025 ఆదివారం







37 మంది హీరోలతో సినిమాలు తీసి అత్యధిక హిట్స్ ఇచ్చిన ఏకైక దర్శకుడు ఆయన ఒక్కరే. అలాగే 77 మంది హీరోయిన్లతో చిత్రాలు తీసిన ఘనత ఇండియాలో రాఘవేంద్రరావుకు మాత్రమే సొంతం.

నేను రుణపడేది ఆయనకే!

తెలుగు సినిమాకు మాస్ హంగులు అద్ది, బాక్సాఫీసును షేక్ చేసిన దర్శకుడు... తెలుగు పాటను రంగులతో అభిషేకించి, సంగీతంతో సంబరాలు చేయించిన సంగీతాభిమాని. హిట్స్, రికార్డ్ బ్రేక్ కలెక్షన్లు, సిల్వర్ జూబ్లీలు, పొగడ్తలు... ఇలా అన్నీ కట్టకట్టుకువచ్చి మీదపడినా.. అన్నిటినీ చిరునవ్వుతో స్వీకరించడం తప్ప, స్టేజ్ మీద కానీ, మరెక్కడైనా కాని అహంకారంతో ఎప్పుడూ ఆయన మాట్లాడలేదు... 'గ్లామర్, గుట్టల గుట్టల పండ్లు, నాయికల నాభి తప్ప... అంతకంటే ఏం తియ్యగలడు' అనే వాళ్లకు 'అన్నమయ్య' అనే అద్భుతాన్ని అందించి తన ప్రతిభను పండించుకున్న ఆ దర్శకుడు... కె. రాఘవేంద్రరావు. యాభై ఏళ్ల కెరీర్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆ దర్శకేంద్రుడు తన సినీ పయనంలో ఎదురైన ఆసక్తికరమైన సంఘటనలను, విశేషాలను 'నవ్య'కు వివరించారిలా...

28 రోజుల్లో 'జ్యోతి'

ఒక పెద్ద సినిమా తీసిన వెంటనే ఓ చిన్న చిత్రం తీయడం చాలా మంచిది. ఆ పద్ధతిని చాలా రోజులు కొనసాగించా. ప్రేక్షకులు అంచనాలు పెంచుకునే అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే 'ఏం తీస్తాడు, ఎలా తీస్తాడు...' అని వారంతా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందుకే రెండో సినిమా 'జ్యోతి'ని ప్రయోగాత్మకంగా 28 రోజుల్లో తీశాను. మురళీమోహన్, జయసుధ జంటగా నటించారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. మురళీమోహన్‌తో చేసిన 'కల్పన' చిత్రం విడుదల అయిన వారం రోజులకు 'అడవిరాముడు' వచ్చింది. ఈ రెండు సినిమాలూ హిట్ అయ్యాయి. అలాగే 'సింహబలుడు' చిత్రం భారీ బడ్జెట్‌తో తయారైతే, ఆ సమయంలోనే 'పదహారేళ్ల వయసు' చిత్రం లోబడ్జెట్‌తో వచ్చింది.





మీరందరూ యాభై ఏళ్లు అయిందని చెబుతుంటే ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే 'పరిశ్రమలోకి వచ్చి ఇన్నేళ్లు అయింది, ఇన్ని సినిమాలు చేశాను' అని నేను ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు. నా పని నేను చేశాను. 'వెయ్యి కోట్ల రూపాయలు కావాలా, డైరెక్షన్ ఛాన్స్ కావాలా?' అని ఎవరైనా ఆఫర్ ఇస్తే... ఇప్పటికీ దర్శకత్వాన్నే కోరుకుంటా. డైరెక్షన్ అంటే నాకు అంత పిచ్చి. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఒకే ఒక వ్యక్తికి రుణపడి ఉంటాను. ఆయనే ఎన్టీఆర్. 'పాండవ వనవాసం' చిత్రంతో పరిశ్రమలోకి ప్రవేశించి, రామారావుగారి మీద తొలి క్లాప్ ఇచ్చాను. అలాగే ఆయన నటించిన 'అడవిరాముడు' సినిమా నుంచే అగ్ర దర్శకుడిగా ఎదిగాను. ఆ రోజు రామారావుగారి మీద క్లాప్ ఇచ్చిన తర్వాత ప్రేక్షకులు ఇన్నేళ్లుగా నా సినిమాలు చూస్తూ ఇన్ని క్లాప్స్ కొడతారని ఊహించలేదు. సినిమా పాటకు ప్రేక్షకులు పట్టాభిషేకం చేసిన సినిమా 'అడవిరాముడు'. రామారావుగారు నడిచి వస్తుంటే ఆ రోజుల్లో జనం పూలు జల్లేవారు, హారతులు ఇచ్చేవారు. 'ఆయన నడిచి వస్తేనే ఇలా చేస్తున్నారు, ఏనుగు ఎక్కిస్తే ఇంకెంత ఆనందిస్తారో?' అని అడవిరాముడు తీశాను. ఆ సినిమాలోని 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' పాట చూసి జనం డబ్బులు విసరడం మొదలుపెట్టారు. అప్పటినుంచి మా కాంబినేషన్‌కు క్రేజ్ మొదలైంది. అలాగే నిర్మాతలు లేకపోతే నేను లేను. ఈ యాభై ఏళ్ల జర్నీ ఇంత విజయవంతంగా సాగడానికి నా నిర్మాతలే కారణం. నాతో పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, పంపిణీదారులకు, థియేటర్ యజమానులకు, నన్ను ఆదరించిన ప్రేక్షకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు.

• హీరో కావాలని అనుకోలేదు

నాకు సినిమాలు అంటే చాలా చాలా ఇష్టం. పుస్తకాలు కొనుక్కోమని ఇంట్లో డబ్బులు ఇస్తే అవి కొనకుండా సినిమాలకు వెళ్లి, స్నేహితుల పుస్తకాలు చదివిన రోజులు ఉన్నాయి. దాదాపు ప్రతి రోజూ సినిమా చూసిన సందర్భాలు ఉన్నాయి. నాకు మొదటి నుంచీ నటన మీద ఆసక్తి లేదు. దర్శకుడినవ్వాలనేదే నా కోరిక. నటుడినో, హీరోనో కావాలని ఎప్పుడూ అనుకోలేదు.

• లక్ష రూపాయలతో తొలి సినిమా అనుకున్నా

ఎన్టీఆర్, కృష్ణ తొలిసారిగా కలిసి నటించిన 'స్త్రీ జన్మ' చిత్రానికి నాన్నగారు దర్శకుడు. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌ని. సెట్‌లో నా ఇన్‌వాల్వ్‌మెంట్, పనితీరు గమనించిన ఆ చిత్ర నిర్మాత రామానాయుడు గారు "రాఘవేంద్రరావ్.. నీ ఫస్ట్ పిక్చర్ నాకే చెయ్యాలి" అనేవారు. "ఇప్పుడు కాదు.. తర్వాత చూద్దాంలే" అన్నారు నాన్నగారు. ఆ తర్వాత నా ఫ్రెండ్స్ ఏవీఎం సీజర్, అడుసుమిల్లి కుమార్, గోపాలకృష్ణ కలసి నా దర్శకత్వంలో సినిమా తీద్దామని వచ్చారు. "ఎవరూ చేయని విధంగా సినిమా తీద్దాం. పల్లెటూరికి వెళ్దాం. లక్ష రూపాయల బడ్జెట్‌లో తీద్దాం" అన్నాను. "లేదు లేదు భారీ బడ్జెట్‌లో తీద్దాం" అన్నారు వాళ్లు. 'బాబు' సినిమాకు మా నాన్న కథ ఇచ్చారు. శోభన్‌బాబు హీరో. ముగ్గురు హీరోయిన్లు. చాలా భారీగా తీశాం. నాకు తొలి అవకాశం ఇచ్చిన ఆ ముగ్గురు మిత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు. సినిమాకు మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. అయితే మా సినిమా విడుదలైన కొన్ని రోజులకు విశ్వనాథ్‌గారి 'జీవనజ్యోతి' రిలీజ్ అయింది. ఆ చిత్రం చూడగానే నా సినిమా భవిష్యత్ అర్థమై పోయింది. ఊహించినట్లుగానే 'జీవనజ్యోతి' వచ్చాక మా సినిమా వసూళ్లు తగ్గాయి.

• మూడు తరాల హీరోలతో...

నేను నిర్మాతల దర్శకుణ్ణి. ఎక్కువ రోజులు షూటింగ్ చేసి నిర్మాతను ఇబ్బంది పెట్టలేదు. అందుకే ఒక్కో నిర్మాతకు చాలా సినిమాలు చేసే అవకాశం కలిగింది. నా అదృష్టం ఏమిటంటే.. నా దర్శకత్వంలో నటించడానికి ఏ హీరోకానీ, నటుడు కానీ 'నో' అనలేదు. మూడు తరాల హీరోలతో పని చేశాను. అందరికీ గుర్తుండిపోయే హిట్స్ ఇచ్చే అవకాశం దక్కడం నా అదృష్టం.

• ఆ టెన్షన్ ఉండేది

రామారావుగారు ఒక సినిమా కోసం దాదాపు 40 రోజుల పాటు ఔట్‌డోర్‌లో ఉండడం అన్నది 'అడవిరాముడు'తోనే మొదలు. అంతవరకూ ఆయనకు ఔట్‌డోర్ అంటే మద్రాసు గిండీ ఫారెస్టే. అటువంటి వ్యక్తి ఈ చిత్రకథ నచ్చి అన్ని రోజులు ఔట్‌డోర్‌లో ఉండిపోయారు. మధ్యలో ఒకటి రెండు సార్లు 'దానవీరశూర కర్ణ' చిత్రం రీరికార్డింగ్ కోసం మద్రాసు వెళ్లి వచ్చారేమో! 'ఈ సినిమా ఆడకపోతే నా కెరీర్ ఏమవుతుందా?' అనే టెన్షన్ 'అడవిరాముడు' చేస్తున్నప్పుడు నాకు ఉండేది. చిన్న సినిమాలు చేసుకోవచ్చు కానీ రామారావుగారు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలతో పని చేశాను. రామారావుగారు షూటింగ్ ముగించుకుని వెళ్లిపోతూ "నా కెరీర్‌లో ఇది మధుర జ్ఞాపకం' అని మెచ్చుకోవడం మరిచిపోలేని సంఘటన. ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు కూడా నా హీరోలు ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్... ఎవరూ నిరుత్సాహపరిచేలా మాట్లాడలేదు. నాకు ఎంతో సపోర్ట్ ఇచ్చారు. అది వారి గొప్పతనం. ముఖ్యంగా రామారావుగారు. ఆయనకు 'సింహబలుడు', 'తిరుగులేని మనిషి' అని రెండు ఫ్లాప్స్ ఇచ్చాను. ఆయన వద్దు అనుకుంటే నాకు మరో అవకాశం వచ్చేది కాదు.. కానీ ఆయన గొప్పతనం ఏమిటంటే.. "ఇట్సాల్ రైట్ బ్రదర్.. ఏం తీయకూడదో నేర్చుకున్నాం. ఈ సారి మంచి కథతో ప్లాన్ చేయండి..' అన్నారు., ఆయన ఆఖరి చిత్రం 'మేజర్ చంద్రకాంత్' చేసే అవకాశం నాకు దక్కడం నా అదృష్టం. అందుకే ఏ ఫంక్షన్‌కు వెళ్లినా "రామారావుగారి వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను" అని చెబుతుంటాను.

• సోషల్ మీడియాను కంట్రోల్ చెయ్యాలి

సోషల్ మీడియాను కంట్రోల్ చేసే పరిస్థితి రావాలి. ముఖ్యంగా కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్ పెట్టే హెడ్డింగ్స్ ఇబ్బందికరంగా ఉంటున్నాయి. వాటిని అదుపు చేయాలి. ఈ విషయంలో నేను కూడా ఓసారి ఇబ్బంది ఎదుర్కొన్నా. అయితే వాటిని నేను పట్టించుకోను కనుక రియాక్ట్ కాలేదు. కానీ రాను రాను విచ్చలవిడితనం పెరిగిపోతోంది.

• పాటలో మొత్తం రామాయణం

నా కెరీర్‌లో అన్ని రకాల చిత్రాలూ చేశాను. 'అన్నమయ్య', 'శ్రీరామదాసు', 'పాండురంగడు', 'మంజునాథ' 'శిరిడి', 'నమో వేంకటేశ' లాంటి సినిమాలు చేశాను. ఇప్పుడు ఓ పాటలో మొత్తం రామాయణాన్ని చూపించాలని నా కోరిక . దానికి సంబంధించిన టెస్ట్ షూట్ కూడా చేశా. అలాగే 'వల్లీ కల్యాణం' కూడా సినిమాగా తీయాలనే ఆలోచన ఉంది.

• వినాయకరావు

ఇప్పుడు తీరికే లేదు



'పెళ్లిసందడి' చిత్రం మళ్లీ తీసిన తర్వాత ఏం చేయాలా అని నాకు తోచలేదు. ఇన్ని సంవత్సరాలు వర్క్ చేసిన తర్వాత న్యాయంగా అయితే రిటైర్ అవ్వాలి, కానీ నాకు పని లేకపోతే తోచదు. అప్పుడు బాగా ఆలోచించి యూ ట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశా. షార్ట్ ఫిల్మ్స్ తీసి అప్‌లోడ్ చేస్తున్నా. పిల్లలకు సంబంధించి రెండేసి నిముషాల షార్ట్ ఫిల్మ్స్ ఏ.ఐ.లో తీస్తున్నాం. దానికోసం తీరిక లేకుండా వర్క్ చేస్తున్నా. కీ బోర్డ్ నేర్చుకుంటున్నా. అలాగే 'కెఆర్ఆర్ క్లాస్‌రూమ్' పేరుతో సినిమాల గురించి ప్రాక్టికల్ నాలెడ్జ్‌ని ఔత్సాహికులకు ఉచితంగా చెబుతున్నా.

ముగ్గురు హీరోలతో 'త్రివేణి సంగమం'



నా నూరవ సినిమాను మొదట చాలా విభిన్నంగా ప్లాన్ చేశాను. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్‌లతో ఆ సినిమా చేయాలని అనుకొని వారిని అడిగాను. ముగ్గురూ ఒప్పుకొన్నారు. 'త్రివేణి సంగమం' అని టైటిల్ అనుకున్నా. ఈ సినిమాను అరవింద్, అశ్వనీదత్‌లతో కలసి తీయాలిన ప్లాన్ చేశా. అయితే పాటల విషయంలో అభిమానుల మధ్య అభిప్రాయ బేధాలు వస్తాయేమో అనే అనుమానం వచ్చి ఆ ప్రాజెక్ట్ ఆపేశాం. అప్పుడు ఓ కొత్త హీరోతో చిన్న సినిమా తీద్దామని అల్లు అర్జున్‌ను పరిచయం చేస్తూ 'గంగోత్రి' తీశాం.

మరచిపోలేని మూడు సంఘటనలు



యాభై ఏళ్ల కెరీర్‌లో మరచిపోలేని మధుర సంఘటనలు మూడు ఉన్నాయి. 'అడవిరాముడు' చిత్రంతోనే పాటలు వచ్చినప్పుడు తెరపైకి డబ్బులు విసరడం అనే ట్రెండ్ మొదలైంది. అలాగే 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' చిత్రం పెద్ద తుపాన్ వచ్చిన సమయంలో విడుదల అయింది. చాలా థియేటర్లలో షోలు పడని పరిస్థితి. కానీ ఒక థియేటర్‌లో మాత్రం వర్షపు నీటిని మోటార్లు పెట్టి బయటకు తోడేస్తుంటే, జనం కుర్చీలో కాళ్లు పెట్టుకుని ఆ సినిమా చూశారు. 'అన్నమయ్య' చిత్రంలో 'మోకాళ్ల పర్వతాన్ని చెప్పులు వేసుకుని ఎక్కకూడదు' అని భానుప్రియ నాగార్జునకు చెప్పే సీన్ వచ్చినప్పుడు థియేటర్‌లో ప్రేక్షకులు కూడా చెప్పులు విడిచిపెట్టి సినిమా చూశారు.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్	THE DIPLOMAT	
ది డిప్లొమాట్	హిందీ చిత్రం	మే 09
గుడ్ బ్యాడ్ అగ్లీ	తమిళ చిత్రం	మే 08
ది రాయల్స్	హిందీ సిరీస్	మే 09
అమెజాన్ ప్రైమ్	Royals	
గ్రామ్ చికిత్సాలయ్	హిందీ చిత్రం	మే 09
జియో హాట్‌స్టార్		
స్టార్‌వార్స్	యానిమేషన్ సిరీస్	మే 04

వినోదాత్మక చికిత్స

ఓ మారుమూల పల్లెలో ప్రభుత్వ ఆస్పత్రి నేపథ్యంలో తెరకెక్కిన హిందీ సిరీస్ 'గ్రామ్ చికిత్సాలయ్'. అక్కడి వసతుల లేమి, వైద్యుల నిర్లక్ష్యంతో అమాయక గ్రామీణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వారి చేతుల్లో దోపిడీకి గురవుతుంటారు. ఈ పరిస్థితుల్లో బదిలీపై ఆ గ్రామానికి వచ్చిన ప్రతిభావంతుడైన యువ వైద్యుడు ప్రభాత్ ఆ పరిస్థితులను మార్చాలని కంకణం కట్టుకుంటాడు. ఆ నేపథ్యంలో అతనికి ఎదురైన సవాళ్లు ఏమిటి, ప్రజలు అతనికి సహకరించారా అనేది వినోదాత్మకంగా ఈ సిరీస్‌లో ఆవిష్కరించారు. అమోల్ పరాశర్ వినయ్ పాఠక్, ఆకాంక్ష రంజన్ కీలకపాత్రలు పోషించారు. రాహుల్ పాండే దర్శకుడు.




బియ్యం నీళ్లు చేసే అద్భుతం..!

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ... శిరోజాలు రాలడం, అవి నిర్జీవంగా మారడం, వాటి చివర్లు చిట్లడం, చుండ్రు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నివారించేందుకు బియ్యం నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఇలా తయారు చేసుకోవాలి...

- ఒక గిన్నెలో ఒక కప్పు బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడగాలి. వెంటనే రెండు కప్పుల నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. తరవాత ఈ నీటిని మరో గిన్నెలోకి వడకట్టాలి.
- బియ్యాన్ని నీటిలో రెండు రోజులు నానబెడితే ఆ నీటిని 'ఫెర్మెంటెడ్ వాటర్' అంటారు. ఈ నీళ్లు మాడుకు, శిరోజాలకు అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఫెర్మెంటెడ్ వాటర్‌ను ఫ్రిజ్‌లో వారంపాటు నిల్వ చేసుకోవచ్చు.



- బియ్యం నీటిలో లావెండర్ లేదా రోజ్‌మేరీ ఆయిల్ చుక్కలు వేసుకుంటే ఫలితం బాగుంటుంది.
- బియ్యం నీళ్లలో బి, ఇ విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఇలా వాడాలి...

- ముందుగా శిరోజాలను కుంకుళ్లు లేదా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. తలను కొద్దిగా ఆరనివ్వాలి. తరవాత బియ్యం నీటిని చేత్తో తీసుకుంటూ కురులకు, మాడుకు పట్టించాలి. బియ్యం నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తలంతా చిలకరించుకోవచ్చు. అయిదు నిమిషాల తరవాత తలను వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావుగంటసేపు ఆరనిచ్చి మంచినీళ్లతో తలను శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

విమానం ఎక్కేముందు...

విమానం ఎక్కేముందు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకపోవడమే మంచిదనీ లేదంటే ప్రయాణంలో అనారోగ్య సమస్యలు తప్పవనీ నిపుణులు చెబుతున్నారు.

- సాధారణంగా అల్పాహారం కింద బ్రోకలీ, క్యాబేజీ తురుము, వెనిగర్ వేసి తయారు చేసిన సలాడ్స్ తీసుకుంటూ ఉంటారు. వీటివల్ల గ్యాస్ చేరి కడుపు ఉబ్బరిస్తుంది. ఉదయం వేళ విమాన ప్రయాణం చేయాల్సి ఉంటే వీటిని తినకపోవడమే మంచిది.
- విమానం ఎక్కడానికి ఒక రోజు ముందు నుంచి బీన్స్, పప్పు దినుసులు తినకూడదు. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి విమానం ఎక్కగానే కడుపులో సమస్యలు ఏర్పడవచ్చు.
- నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, వీధుల్లో అమ్మే పదార్థాలు తినకూడదు. వీటివల్ల కడుపులో వికారం, వాంతులు, తలనొప్పి లాంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు.
- విమానం ఎక్కడానికి గంట ముందు నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్, ఆల్కహాల్ తీసుకోకూడదు. వీటివల్ల కడుపులో తిప్పడం, తల తిరగడం, తేన్పులు, కడుపు ఉబ్బరించడం లాంటివి ఏర్పడవచ్చు. సరిగా నిద్ర పట్టక అలసటగా అనిపిస్తుంది.
- కొంతమందికి చూయింగ్ గమ్ నమలడం, క్యాండీస్ తినడం అలవాటుగా ఉంటుంది. వీటివల్ల కూడా సమస్యలు ఏర్పడవచ్చు.
- విమానం ఎక్కేముందు కారంగా ఉన్నవి, మసాలాలు చేర్చిన ఆహార పదార్థాలు తినకూడదు. వీటి వల్ల గుండెలో మంటగా అనిపిస్తుంది.



అద్భుతమైన మహిళల కోసం

నూట తొంభై ఐదు దేశాలు... పది లక్షలమంది మహిళలు... వారి జీవన స్థితిగతులు... 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' పేరుతో మహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు... విశాఖకు చెందిన భరద్వాజ్ దయాల. వివిధ దేశాల్లో విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళల జీవితాలను ప్రతిబింబిస్తూ ఒక డాక్యుమెంటరీ రూపొందిస్తున్నారు. ఏడాదిన్నరలో బైక్‌పై ఐదు ఖండాలు, 16 దేశాలు చుట్టివచ్చిన ఆయన... 'నవ్య'తో ఆ విశేషాలు పంచుకున్నారు.



"సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం. భారీ జీతం. కానీ జీవితమంటే సంపాదన మాత్రమే కాదని కొన్నేళ్ల ఉద్యోగ జీవితం తరువాత అనిపించింది. దానికితోడు కొత్తగా ఏదైనా చేయాలన్న తపన నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. దాంతో 2006లో బైక్‌పై ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాను.

ఐదు ఖండాల్లోని 16 దేశాల మీదుగా 48 వేల కిలోమీటర్లు ప్రయాణించాను. ఏడాదిన్నరపాటు సాగింది ఈ యాత్ర. బైక్‌పై ప్రపంచ యాత్ర పూర్తి చేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందాను. ఆ యాత్ర విశాఖలో ప్రారంభమై... ఇరాన్, టర్కీ, సిరియా, జోర్డాన్ మీదుగా ఆఫ్రికా, ఈజిప్ట్, యూరప్‌లోని గ్రీస్ వరకూ సాగింది. ఆ తరువాత ఫ్రాన్స్ మీదుగా యూకే అట్లాంటిక్ సముద్రం దాటి కెనడా, అమెరికా చేరుకున్నా. పసిఫిక్ మహా సముద్రం దాటి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ మీదుగా భారత్‌కు వచ్చాక మళ్లీ ఉద్యోగ జీవితంలో నిమగ్నమయ్యాను. ఈ క్రమంలోనే మా అమ్మ కుసుమ దయాల్ ఐదుగురి సంతానాన్ని పెంచి పోషించేందుకు చేసిన త్యాగం, పడిన కష్టాలు గుర్తుకువచ్చాయి. అమ్మ లాంటి ఎంతోమంది మాతృమూర్తుల గురించి ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటేషన్‌కు శ్రీకారం చుట్టాను.

దేశదేశాల్లోని మహిళల జీవితాలతో...

195 దేశాల్లోని విభిన్న రాష్ట్రాలు, జాతులు, కులాలు, మతాలు, వర్గాలకు చెందిన పది లక్షల మంది మహిళల జీవితాలను ఆవిష్కరించడమే 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటరీ ప్రధాన ఉద్దేశం. ఉన్నత స్థాయి నుంచి కూలి పనులు చేసుకునే మహిళల వరకు అందరి జీవితాలకు సంబంధించిన కీలక ఘట్టాలు అందులో ఉంటాయి. ఇప్పటివరకూ ఇలా ఇన్ని దేశాల మహిళల ఫొటోగ్రఫీలతో కూడిన డాక్యుమెంటు ఎవరూ చేయలేదు. అందుకే నేను ఈ మహత్తర కార్యం చేపట్టాలని అనుకున్నాను.

మహిళా దినోత్సవంనాడు...

'మిలియన్ అమేజింగ్ ఉమెన్స్' డాక్యుమెంటేషన్ పూర్తికావడానికి పది నుంచి పన్నెండేళ్ల సమయం పడుతుందని అంచనా. గత నెల, అంటే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని బరోడా నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాను. ఇందులో తొలి పోట్రైట్ ఫొటో బరోడా రాజమాత సుభాంగిని రాజేది. బ్రిటిష్ రాణి కంటే అతిపెద్ద కోటలో ఉండే ఆమెకు సంబంధించిన ఫొటోను తీయడం ద్వారా డాక్యుమెంటేషన్ ప్రారంభమైంది. ఇప్పటివరకూ 400 మందికిపైగా మహిళల ఫొటోలు, వివరాలు సేకరించాను. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళలపై డాక్యుమెంటేషన్ సాగుతోంది. ప్రస్తుతం ఉత్తర భారత్‌లోని పలు రాష్ట్రాల మహిళలను కెమెరాలో బంధించే పనిలో ఉన్నాను. ఇప్పటివరకు సంప్రతించినవారిలో రోజు కూలీలు, గిరిజన మహిళలు, సామాజిక కార్యకర్తలు, కార్మికులు ఉన్నారు. అన్నీ కలిపి 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాను. కొన్ని వీడియోలు కూడా చిత్రీకరిస్తున్నాను. ప్రతి మహిళ వెనుక ఒక విజయ గాథ ఉంటుంది. దాన్ని ఈ ప్రపంచానికి చెప్పడమే నా ఉద్దేశం. పది లక్షలమంది మహిళలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ అంటే సాధారణ విషయం కాదు. ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. అందుకు సిద్ధమయ్యే ఈ అద్భుత ప్రాజెక్ట్‌ను చేపట్టాను."

- బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం

సంపాదించింది అంతా...

ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాను. దీని కోసం ఇప్పటివరకూ నేను సంపాదించింది అంతా ఖర్చు చేస్తున్నాను. దీనిలో భాగంగా నా కారును ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నాను.



పాఠశాల భవనం పనులను పరిశీలిస్తున్న కొండపల్లి శ్రీనివాస్

పీ-4 మోడల్‌తో అభివృద్ధి

● 39 ఎంఎస్ఎంఈ పార్కులకు నిధులు సిద్ధం
● మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటుసంస్థలను సమన్వయం చేసుకుని, పి-4 మోడల్‌తో అభివృద్ధి పనులు చేపడుతూ ముందుకు సాగాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.శనివారం మండలంలోని కెంగువలో ఎన్సీట ఆల్‌రౌండ్ సంస్థ నిర్మిస్తున్న పాఠశాల పనులు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతు పదేళ్లగా గ్రామంలో పాఠశాల శిథిలావస్థలో ఉన్నా స్కూల్ కమిటీ ఎన్నికలు జరగకపోవడంతో నిధులు మంజూరుకాలేదని తెలిపారు.దీంతో విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు భయాందోళన చెందుతుండడంతో ఎన్నికలసమయంలో ఇచ్చినహామీ మేరకు పాఠశాల నిర్మాణం స్వచ్ఛంద సంస్థకు అప్పగించినట్లు చెప్పారు.విజన్-2047, పి-4 మోడల్‌తో నియోజకవర్గంలో ప్రథమంగా కెంగువలో పాఠశాలనిర్మాణానికి స్వచ్ఛంద సంస్థ ముందుకురావడం అభినందనీయమన్నారు. జూన్ 15 నాటికి పాఠశాల నిర్మాణం పూర్తిచేసి జిల్లా విద్యాశాఖ అధికారుకులకు అప్పగించాలని సూచించినట్లు తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు ముందుచూపుతో అమరావతి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారని చెప్పారు.రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా పాలనసాగుతోందన్నారు. ఇప్పటికే 11 ఎంఎస్ఎంఈ పార్కులు ప్రారంభించామని, 39 పార్కులకు నిధులు సిద్ధం చేస్తామని తెలిపారు. గజపతినగరం నియోజకవర్గంలోని బొండపల్లి మండలం కొండకిండాం, బొబ్బిలి నియోజకవర్గంలో కొట్టక్కిలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈవో మాణిక్యంనాయుడు, డిప్యూటీడీఈవో మోహనరావు, శ్రీధర్,శీరం రెడ్డిరామ్‌కుమార్ పాల్గొన్నారు.

కాశీలో బొద్దూరు వాసి మృతి



దామోదర రావు(ఫైల్)

సంతకవిటి, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొదూరు గ్రామానికి చెందిన గేదెల దామోదరరావు (55) కాశీలో మృతిచెందాడు. గ్రామస్థుల కథనం మేరకు.. గత నెల 28న తన తల్లిదండ్రులు నీలంనాయుడు, బుల్లమ్మడు, ఇద్దరు కుమారులు భార్గవ్‌నాయుడు, దినీష్‌కుమార్‌తో కలిసి కాశీ యాత్రకు దామోదరరావు బయలుదేరారు.విశ్వనాథుడి దర్శనం అనంతరం యాత్ర ముగించుకొని గురువారం తిరుగు ప్రయాణమయ్యారు.రైలు బయలుదేరిన కొద్ది సమయానికే అకస్మాత్తుగా దామోదరరావుకు గుండెపోటువచ్చింది. హుటాహుటిన వారణాశిలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు.

అపస్మారకస్థితిలో గుర్తుతెలియని వ్యక్తి



అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి

రాజాం రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి):రాజాం మండలంలోని బొద్దాం గ్రామంలో గల కనకమహాలక్ష్మి కాలనీలో అపస్మారకస్థితిలో పడిఉన్న ఓ వ్యక్తిని ఆ కాలనీవాసులు శనివారం గుర్తించారు.వారంతా రాజాంపోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆ గుర్తుతెలియని వ్యక్తిని రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించేఏర్పాట్లు చేయించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. అనంతరం శనివారం రాత్రి విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. సుమారు 60 ఏళ్లు ఉండే ఆ వ్యక్తి అపస్మారకస్థితిలో ఉండడంతో గుర్తిం చేందుకు ఎటువంటి ఆధారాల్లేవని, సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు లేవని ఏఎస్ఐ జనార్దనరావు శనివారం రాత్రి తెలిపారు. ఎలా వచ్చారో తెలియదని, శరీరంపై ఎటువంటి గాయాల్లేవని చెప్పారు. ఫోటో ఆధారంగా సంబంధీకులు విశాఖలోని కేజీహెచ్‌కు సంప్రదించాలని సూచించారు.

నేడు త్యాగరాజ స్వామి జయంత్యుత్సవం

విజయనగరం రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని రోటరీ దళగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో ఆదివారం త్యాగరాజస్వామి జయంత్యుత్సవాన్ని నిర్వహించనున్నట్లు అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టరు మండపాక రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విద్వాంసులు, సంగీత గురువులు, విద్యార్థులతో ఘనరాగ పంచరత్న కృతుల గోష్టి గానాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

వేపాడ, మే3(ఆంధ్రజ్యోతి):మండలంలోని రామస్వామిపేటలో శని,ఆది, సోమవారాల్లో రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.తొలిరోజు శనివారం పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

18న హనుమాన్ జయంతి శోభాయాత్ర

విజయనగరం దాసన్నపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈనెల 18న హనుమాన్ శోభాయాత్రను నిర్వహిస్తుంచనున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంటిరాజు తెలిపారు.శనివారం విజయనగరంలోని నిర్వహించిన ఓ కార్యక్రమంలో శోభాయాత్ర కరపత్రాలను వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ప్రతినిధులు ఆవిష్కరించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఉగ్రవాదంపై పోరాటం చేస్తున్న భారత సైనికులకు అండగా నిలవాలన్నారు. హిందూవులంతా హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ మాట్లాడుతూ హిందూ బంధువులు అందరూ జయంతి శోభా యాత్రలో పాల్గొనాలన్నారు.

పల్లెల్లో హత్యారాజకీయాలు

రాజాం రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): వంగర వైసీపీ మండలాధ్యక్షుడు కరణం సుదర్శనరావును ఈనెల రెండోతేదీన హత్య చేసేందుకు ప్రయత్నించినవారిని శిక్షించాలని జడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు,మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. వంగర మండలంలోని తన స్వగ్రామం ఆర్‌ఆర్ పేటనుంచి శుక్రవారంరాత్రి రాజాం కారులో వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఆరుగురు టీడీపీ సానుభూతిపరులు దాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. శనివారం రాజాంలో చంద్రశేఖర్, శ్రీనివాసరావు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం పల్లెల్లో కూడా హత్యారాజకీయాలు చేస్తోందని విమర్శించారు.సుదర్శనరావు కుటుంబానికి పార్టీ అండగాఉంటుందని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కం బాల జోగులు, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేష్ పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన

కొత్తవలస, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబు తెలిపారు. శనివారం కొత్తవలసలో సూర్యఘర్ పథకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ వెంకటరావు, స్థానిక ఏఈ అప్పారావు సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేపై వర్క్‌షాప్

చీపురుపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో భూముల రీసర్వేపై శనివారం డివిజన్ స్థాయి వర్క్‌షాప్ ఆర్డీవో జీవీ సత్యవాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలో పాల్గొననున్న సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికారుల సూచనలను పాటిస్తూ, రీ సర్వే కార్యక్రమాన్ని ఎటువంటి తప్పులు లేకుండా గడువులోపల ముగించాలన్నారు. కార్యక్రమానికి డివిజన్‌లో ఉన్న తహశీల్దార్లు, రీ సర్వే డీటీలు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు హాజరయ్యారు.

ప్లాస్టిక్‌ను విక్రయిస్తే చర్యలు

విజయనగరం రింగురోడ్డు, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ సామగ్రి విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నగరపాలకసంస్థ కమిషనర్ పి.నల్లనయ్య హెచ్చరించారు. శనివారం విజయనగరంలో సచివాలయాల వారీగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలపై పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు సంయుక్తంగా పలు షాపుల్లో దాడులు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్‌పై దాడులు నిర్వహించి, అపరాధ రుసుము విధించారు. ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనంచేసుకున్నారు. ఈ సందర్భంగా నల్లనయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాని కోరారు. 20 మైక్రాన్ల కన్నా, తక్కువ మందం గల పాలిథిన్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ సామగ్రిని వినియోగించవద్దని కోరారు.

ప్రతి గ్రామానికి లింకు రోడ్లు

● శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



మెటల్ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామానికి లింకు రోడ్లు నిర్మించనున్నట్లు శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శనివారం మండలంలోని సంతపేటలో 30 లక్షల మెటల్ రోడ్డుకు లలితకుమారి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూకిత్తన్నపేట మార్గంనుంచి బొబ్బిలి వారి కళ్లాలకు వెళ్లే మార్గాన్ని గ్రావెల్ మెటల్ రోడ్డు వేసేందుకు రూ.30లక్షల నిధులు మంజూరు చేసినట్లు లలితకుమారి పేర్కొన్నారు. పొలాలు, కళ్లాలకు గ్రావెల్ మెటల్ రోడ్లు వేసేందుకు టీడీపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, చొక్కాకుల మల్లునాయుడు, సర్పంచ్ సన్యాసమ్మ, జేఈ వీరలక్ష్మి ప్రకాష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

● ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



మాట్లాడుతున్న రఘురాజు

శృంగవరపుకోట, మే 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. శనివారం శృంగవరపుకోటలో వేసవి బ్యాడ్మింటన్ క్రీడా శిబిరం ప్రారంబించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో రాణించే విద్యార్థులకు చదువు, ఉద్యో గాలకు మూడు శాతం రిజర్వేషన్ ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ, జాతీయ బ్యాడ్మింటిన్ క్రీడాకారిణి ఇందుకూరి సుధారాజు, డాక్టర్ ఎస్‌వీ సత్యశేఖర్, ఏఎస్ వెంకటరావు, మళ్ల రామకృష్ణ, వ్యాయమ ఉపాధ్యాయుడు పోట్నూరు శ్రీరాములు పాల్గొన్నారు.

ఏబీడీఎంతో చికిత్సల వివరాల నమోదు

● ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం రింగురోడ్డు, మే 3 (ఆంధ్రజ్యోతి):ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం)తో ప్రతి రోగి ఆరోగ్య చికిత్సల నమోదు ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు తెలిపారు. శనివారం స్థానికప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఏబీడీఎంతో ప్రతిరోగి వ్యాధుల వివరాలు తెలుస్తాయని చెప్పారు. ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులు ముందుగా అభయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓపీ టిక్కెట్ సులువుగా ఆన్‌లైన్‌లోపొందవచ్చని తెలిపారు.సర్వజన ఆసుపత్రిలో కార్డియాలజీ, న్యూరోసర్జరీ, మెడిసన్, నెఫ్రాలజీ, యురాలజీ, మెడికల్ అంకాలజీ, పలమనాలజీ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. క్యాన్సర్‌కు సంబంధించి అంకాలజీ వైద్య సేవలు ప్రతిమంగళ, గురువారాలు, యురాలజీ ఓపీ సేవలు మంగళ, శుక్రవారాలు, న్యూరోసర్జరీ విభాగం ఓపీ సేవలు సోమ, గురు, శనివారాలు, న్యూరో మెడిసిన్‌విభాగం ఓపీ సేవలు సోమ, గురు, శనివారాలు, నెఫ్రాలజీ, కిడ్నీ చికిత్సలు మంగళ, శుక్రవారంలో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరిడెంటెంట్ ఎం.శివశ్రీధర్, ఆర్‌ఎంవో కామేశ్వరరావు పాల్గొన్నారు.

కళాకారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలి

విజయనగరం రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): 50 ఏళ్లు దాటిన కళాకారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని గిడుగు రామమూర్తి తెలుగుభాష, జానపద కళా పీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు కోరారు. అంతరించిపోతున్న జానపద కళలను ఆదరించాలని పేర్కొన్నారు. శనివారం విజయనగరంలోని కోట వద్ద కళాపీఠం ప్రతినిధులు, ఉత్తరాంధ్ర నవచైతన్య నాట్య కళా సంక్షేమ సంఘం ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూర్మారావు మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్, అరకు, బోపాల్ వంటి ప్రాంతాల్లో జరిగిన వివిధ కార్యక్రమాల్లో విజయనగరం జిల్లా జముకులు, తూర్పుభాగవతం, చెక్కభజన కళాకారులకు అవకాశం రావడం హర్షనీయమన్నారు. సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల జముకుల పాట, చెక్కభజన, సాము గరిడి, పులివేశం, కోలాటం బృంద గురువులు అట్టాడ లక్ష్మీనాయుడు, మత్స్య తవిటినాయుడు పాల్గొన్నారు.

అదాని కంపెనీ పోయే వరకు పోరాటం



అదాని కంపెనీని తరిమికొడతామని హెచ్చరిస్తున్న గిరిజన నాయకులు

వేపాడ, మే 3 (ఆంధ్రజ్యోతి): అదాని కంపెనీ వెనక్కిపోయే వరకు పోరాడుతామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం తెలిపారు. ఆ కంపెనీ మారిక గ్రామానికి వస్తే సహించేదిలేదని హెచ్చరించారు. శనివారం మండలంలోని కరకవలస గ్రామ శివారు గిరిశిఖరగ్రామం మారికగ్రామాన్ని సందర్శించి గిరిజనులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమాయక గిరిజనల బతుకులను గుజరాత్‌కు చెందిన ఓ అదానికి అప్పగించడం అన్యాయమన్నారు. ఇక్కడ అదానీ హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసిన నేపధ్యంలో గ్రామాన్ని సందర్శించానన్నారు.అదానీ మారిక గ్రామానికి రాకు.. వస్తేబాణాలతో కొట్టి తరుముతామని తెలిపారు.కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, కరకవలస సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ప్రజా సంఘాల నాయకులు దాసరి వెంకన్న, జి.అప్పారావు,ఆనందు,రమణ,వీర్రాజు,బాబూరావు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో సారవంతం

దత్తిరాజేరు, మే 3(ఆంధ్రజ్యోతి):నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని విజయనగరం డీఆర్‌సీ ఏవో గోవిందమ్మ తెలిపారు. శనివారం విద్యవాసి గ్రామంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నవధాన్యాలు కిట్లను తయారు చేసి రైతులకు అందజేస్తారని తెలిపారు.కార్యక్రమంలో వీఏఏ సతీష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పలనాయుడు, మణికుమారి పాల్గొన్నారు.

అమరావతి సభ ఒక చారిత్రాత్మక ఘట్టం: ఎంపీ కలిశెట్టి

న్యూఢిల్లీ, మే 3(ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃప్రారంభ సభ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ప్రధాని మోదీ రాకతో రాజధాని అమరావతి ప్రపంచస్థాయి గుర్తింపుని సాధించిందన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి సీఎం చంద్రబాబు అసమాన దార్శనికత, అవిశ్రాంత కృషి, సంకల్పబలమే కారణమని ఎంపీ కలిశెట్టి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు దీర్ఘదృష్టితో అమరావతి దేశ ఆర్థిక వృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ అధ్వర్యంలో అమరావతి రాజధాని ప్రపంచంలోని ప్రతి తెలుగువాడి గుండెల్లో గర్వం నింపేలా రూపొందాలని ఎంపీ కలిశెట్టి ఆకాంక్షించారు.

రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీ



ఆహార పదార్థాలను తనిఖీలు నిర్వహిస్తున్న నాగుల్ మీరా

విజయనగరం రింగురోడ్డు, మే 3 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని రింగురోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారి నాగుల్ మీరా ఆకస్మిక తనిఖీలు శనివారం నిర్వహించారు. సన్నిఫ్యామిలీ రెస్టారెంట్‌లో కుళ్లిన లాలీపాప్ ఇచ్చారని, ఈ విషయంపై ప్రశ్నిస్తే సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని ఒక వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదుతో దాడులు నిర్వహించారు. హోటల్‌లోని కిచెన్ రూములో వంట, సరుకులు నిల్వచేసే ప్రాంతం అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించారు. ఆహారం శ్యాంపిళ్లను సేకరించి, హైదరాబాద్‌లోని నాంచారం ప్రయోగశాలను పంపిస్తామని, నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని నాగుల్ మీరా తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

శృంగవరపుకోట, మే 3(ఆంధ్రజ్యోతి): పురుషులు, మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆర్టికల్ 39(డి) హామీ ఇస్తోందని శృంగవరపుకోట కోర్టు న్యాయాధికారి బి.కనకలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు జి.సూరిదేముడు ఆధ్వర్యంలో అసంఘటత కార్మికులకు సంబంధించిన న్యాయ అవగాహన సదస్సు జరిగింది. కార్య క్రమంలో న్యాయవాదుల సంఘ కార్యదర్శి బీవీఎస్‌రామారావు, బి.సత్యనారాయణ, వారది ఈశ్వరరావు, డబ్ల్యూఎన్ శర్మ, బొబ్బిలి రామకృష్ణ పాల్గొన్నారు.

● గజపతినగరం మే3(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయాధికారి విజయ్‌రాజ్‌కుమార్ కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో ఆటో వాహనదారులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్‌రాజు,రమణాజీ, రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి

నెల్లిమర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి):పట్టణాభివృద్ధికి అన్నిపార్టీల సభ్యులు సహకరించాలని నెల్లిమర్ల నగర పంచాయితీ చైర్‌పర్సన్, జనసేన నాయకురాలు బంగారు సరోజిని కోరారు.శనివారం నెల్లిమర్లలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్డీఏ పార్టీలకు చెందిన నాయకులు, కౌన్సిలర్లు పొత్తు ధర్మానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. పాలనతోపాటు అన్ని విషయాల్లో తనను నియంత్రించేందుకు ఓ వ్యక్తి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. తాను జనసేనలోకి మారిన తర్వాత కూటమి పార్టీకి చెందిన ఇంకో వ్యక్తి తనపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని చెప్పారు. సమావేశంలోజనసేన పార్టీ నాయకులు అప్పికొండ రవికుమార్, రవ్వా నాని, పాండ్రంకి సత్యనారాయణ, మజ్జి రాంబాబు, బంగారు భానుప్రకాష్, బంగారు శంకరరావు, పలిశెట్టి దొరబాబు పాల్గొన్నారు.

దేశ అవసరాలు తీర్చేలా పరిశోధనలు ఉండాలి

నెల్లిమర్ల, మే 3(ఆంధ్రజ్యోతి): దేశ, సమాజ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పరిశోధనలు జరపాలని సెంచూరియర్ విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు పిలుపునిచ్చారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పరిశోధనసమావేశంలో మాట్లాడుతూ సాంకేతికపరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత సమాజంలో మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి పాల్గొన్నారు.

జేఎస్ఎల్ లాకౌట్ ఎత్తివేయాలి

కొత్తవలస, మే 3 (ఆంధ్రజ్యోతి) : తమకు న్యాయం జరిగేవరకు పోరాటం ఆగదని, తక్షణమే జేఎస్ఎల్ లాకౌట్ ఎత్తివేయాలని జేఎస్ఎల్ కార్మగారానికి చెందిన కార్మికులు కోరారు. శనివారం మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్‌నగర్‌లోని జేఎస్ఎల్ కార్మగారం వద్ద వైసీపీ ట్రేడ్ యూనియన్, టీఎన్‌టీయూసీ, సీఐటీయు కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు కంపెనీ గేట్ వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా కార్మిక సంఘాలకు చెందిన నాయకులు పిల్లా అప్పలరాజు, నమ్మిచినబాబు, వాయాలు, నలాది బీమయ్య మాట్లాడుతూ యాజమాన్య మొండివైఖరితో కార్మికులతో ఆటలాడుకుంటోందని ఆరోపించారు.

మిమ్స్‌లో కళా క్రిత్వ-2025 వేడుకలు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైద్య విద్యార్థినులు

నెల్లిమర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): మిమ్స్ వైద్య కళాశాలలో కొద్ది రోజులుగా జరుగుతున్న కళా క్రిత్వ 2025 వేడుకలు శనివారం వైద్యవిద్యార్థుల నృత్య ప్రదర్శనలు, కేరింతల మధ్య ముగిశాయి.వైద్య విద్య అభ్యాసంలో రోజూ ఒత్తిడితో గడుపుతున్న నేపథ్యంలో వారికి ఆటవిడుపుగా ఉండేవిధంగా కళాక్రిత్వ పేరిట కార్యక్రమాన్ని వినూత్న రీతిలో యాజమాన్యం రూపొందించింది. 20 రోజులకుపైగా సాగిన ఈ కార్యక్రమంలోభాగంగా క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయాఅంశాల్లో విజేతలుగా నిలిచిన వారికి మిమ్స్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు, జీవీవీఎస్ఎన్ వర్మ, డీన్ సీహెచ్ లక్ష్మీకుమార్, డైరెక్టర్ వేణుగోపాల్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రఘురామ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నీలిమ బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో విద్యుత్ కాంతుల మధ్య నృత్యం చేస్తూ విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బాబా రథోత్సవం

లక్కవరపుకోట, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలో సత్యసాయిబాబా రథోత్సవం ఊరేగింపు భక్తి శ్రద్ధలతో జరిగింది. శనివారం సాయిబాబా రథం ఎల్.కోట, సంతపేట, మల్లివీడు, చందులూరు, లచ్చింపేట, రేగ, కల్లేపల్లి గ్రామాల మీదుగా సాగింది. కల్లేపల్లి సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు ఎ.రమణమ్మ, నక్క రాజు, జగన్ వేణి, జి.త్రిమూర్తులు రథయాత్రలో సాయి కీర్తనలు ఆలపించారు.

●భోగాపురం, మే3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మయ్యపేటలో శనివారం ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.ఈ సందర్భంగా నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఏపీ మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతుబంగారాజు పూజలు నిర్వహించారు.అనంతరం నిర్వాహకులకు రూ.20వేలు అందజేశారు ఆయనతో పాటు నాయకులు దాట్లశ్రీనివాసరాజు, కొత్తయ్యరెడ్డి ఉన్నారు.

●కొత్తవలస, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గనిశెట్టిపాలెంలో సీతారామాలయ ప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతున్నాయి. శుక్రవారం గణపతి పూజను వేదపండితులు ప్రారంభించారు. రక్షా బంధనం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు.

జనసేన నాయకుడిపై అట్రాసిటీ కేసు నమోదు

విజయనగరం క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి):జనసేన నాయకుడు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మిడతాన రవికుమార్‌పై శనివారం విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపారు. నాలుగేళ్లుగా నమ్మించి పెళ్లి చేసుకుంటానని మోసగించడంతో విశాఖ కంచరపాలెంకు చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తాను తక్కువ కులమని దూషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.

వేధింపులపై మహిళ ఫిర్యాదు

జామి, మే 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అలమండకు చెందిన ఓ వివాహిత తనను ఓ వ్యక్తి మూడేళ్లుగా శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు శనివారం రాత్రి పోలీసులను ఆశ్రయించింది.జామి పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బంగారురాజుపాలెంకు చెందిన ఓ వ్యక్తి మూడేళ్లుగా వివాహితకు అనేకరకాలుగా హింసిస్తున్నాడు. తన అనుమతి లేకుండా మూడేళ్లుగా శారీరక హింసకుపాల్పడుతున్నాడు.ఈ మేరకు అలమండ గ్రామానికి చెందిన ఆమె ఫిర్యాదుచేసింది. కొద్దేళ్లుగా భర్తనుంచి విడిపోయి తన కుమారుడు, కుమార్తెతో ఉంటోంది. ఈ మేరకు ఎస్ఐ వీర జనార్దన్ నమోదుచేసి దర్యాప్తుచేపట్టారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు



పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు కాలిపోతున్న దృశ్యం

చీపురుపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): గరివిడిలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పట్టణంలోని ఎర్ర చెరువు సమీపంలోని ఓ కొబ్బరి చెట్టుపై పిడుగుపడింది. దీంతో కొబ్బరి చెట్టుకు మంటలు అంటుకున్నాయి. కాగా ఆ సమయంలో ఎవరు సమీపంలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.పట్టణంలో ఈదురుగాలులతో కూడిన వర్షంతోపాటు పిడుగులుపడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

భూవివాదంపై ఎట్టకేలకు విచారణ

రేగిడి/వంగర, మే 3 (ఆంధ్రజ్యోతి): రేగిడి, వంగర మండలాల సరిహద్దులోని సరసనాపల్లి-జగన్నాథవలసలో కొద్దేళ్లుగా నెలకొన్న భూవివాదంపై ఎట్టకేలకు అధికారులు శనివారం విచారణ నిర్వహించారు. వంగర మండలంలోని జగన్నాథవలసకు చెందిన తండ్రికుమార్తె పడాల సన్యాసిరావు, బళ్లా రుక్కిబాయిలు మంత్రి లోకేష్ ఫిర్యాదుల విభాగానికి, కలెక్టర్ పీజీఆర్ఎస్ దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లారు. ఈనేపథ్యంలో మంత్రిలోకేష్ కార్యాలయం ఆదేశాలతో కలెక్టర్ అంబేద్కర్ భూసమస్యపై విచారణ నిర్వహించి నివేదిక అందచేయాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, ల్యాండ్ సర్వే భూరికార్డుల విభాగం ఏడీ రమణమూర్తిలను ఆదేశించారు. దీంతో శనివారం వారిద్దరూ రేగిడి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారుని కుమార్తెను కూడా విచారణ నిర్వహించారు. కార్యాలయంలో రికార్డులు, ఫిర్యాదుదారుల వద్ద ఆధారాలు పరిశీలించిన విచారణ అధికారులో క్షేత్రస్థాయి విచారణకు తహసీల్దార్ ఈశ్వరరావును ఆదేశించారు. తక్షణమే విచారణ నిర్వహించి నివేదికలు కలెక్టర్ కార్యాలయానికి అందచేయలని కోరారు. అలాగే ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తామని అధికారులు తెలిపారు.

ఇతిహాసాలపై అవగాహన అవసరం

రాజాం, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇతిహాసాలపై పూర్తి స్థాయిలో అవగాహన అవసరమని వికాస తరంగణి ముఖ్య సమన్వయ కర్త వాకచర్ల వెంకట పైడిరాజు తెలిపారు. రాజాంలోని వికాస తరంగణి ఆధ్వర్యంలో జరిగిన ప్రజ్ఞ వేసవి శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి.ఈ సందర్భంగా మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే ఇతిహాసాలు, సనాతన ధర్మం పట్ల అవగాహన కలిగిఉండాలన్నారు. కార్యక్రమంలో వికాస తరంగణి సభ్యులు అమనాన నీలకంఠం, పెంకి చైతన్యకుమార్, మహంతి సత్యనారాయణ, డొంక త్రినాధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు సిద్ధం

● డీఈవో మాణిక్యంనాయుడు


గజపతినగరం: రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో

గజపతినగరం, మే3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల విద్యార్థులకు అవసరమైన కిట్ బ్యాగ్‌ల పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని డీఈవో యు.మాణిక్యంనాయుడు తెలిపారు. శనివారం గజపతినగరం మండల వనరుల కేంద్రంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రలో విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన పుస్తకాల స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరానికి అవసరమైన విద్యాకిట్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మండలానికి సంబంధించి 3523మంది విద్యార్థులకు యూనిఫామ్, బూట్లు, స్కూల్ బ్యాగ్, వర్క్‌బుక్, టెస్ట్ బుక్,నోట్‌బుక్ డిక్షనరీతో కలిసి కిట్‌ను అందజేయనున్నట్లు చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఏపీసీ రామారావు, డిప్యూటీ డీఈవో మోహనరావు, ఎంఈవోలు ఎస్.విమలమ్మ, చక్రధరరావు, శివాజీ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

శృంగవరపుకోట రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డీఈవో మాణిక్యాలనాయుడు పిలుపునిచ్చారు. శనివారం ధర్మవరం ఉన్నతపాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో నిర్వహిస్తున్న వేసవిశిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు చక్కటిపునాది వేసేందుకు ఏటీఎల్ సమ్మర్ బూట్ క్యాంప్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాసైన్స్ అధికారి రాజేష్,ల్యాబ్ ఇన్‌చార్జి రమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి దాడితల్లి పండగ

బొబ్బిలి రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి పండగ ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించున్నారు. మంగళవారం ఘనంగా రథోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ కార్యదర్శి జనార్ధనరావు తెలిపారు.

త్వరితగతిన పనులు పూర్తిచేయాలి

● బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం సమీపిస్తున్న తరుణంలో ఇంకా చేపట్టాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు శనివారం ఆమె పట్టణంలో పర్యటించారు. వనం గుడి వద్ద ఉన్న ఖాళీ విద్యుత్ స్తంభాలకు లైట్లు వేయించాల్సిందిగా అసిస్టెంట్ ఇంజనీర్‌కు ఆదేశించారు. అలాగే వేణుగోపాల హైస్కూల్ ఎదురుగా ఉన్న చెత్తను తొలగింపజేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశించారు. ఆమె పలువురు అధికారులు ఉన్నారు.

బీసీ రుణాలకు సహకరించండి

రామభద్రపురం, మే 3(ఆంధ్రజ్యోతి): బీసీ రుణాల మంజూరుకు బ్యాంకర్లు సహకరించకపోవడం దారుణమని టీడీపీ విజయనగరం పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. బూసాయవలస గ్రామంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మార్చి నెలలో ఈ రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించినా ఇప్పటికీ లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. మండలంలో 82 యూనిట్లకు గాను 455 మంది దరఖాస్తులు రాగా, వీటిలో 94 దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయం ద్వారా బ్యాంకులకు పంపించారని చెప్పారు. అయినప్పటికీ బ్యాంకర్లు గ్రౌండింగ్‌కు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతో రొంపల్లి ఎంపీటీసీ భవిరెడ్డి శంకరరావు ఉన్నారు

వేసవి క్రీడా శిబిరం ప్రారంభం

చీపురుపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వాహకులు కె.మురళీధర్, పీసీ స్వరూప్ మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, కబడ్డీ తదితర క్రీడల్లో పది నుంచి 16 ఏళ్లలోపు వారికి నెలరోజుల పాటు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసీసీ నాయకులు మీసాల వరహాలనాయుడు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, టీడీసీ ప్రతినిధులు గద్దే అనురాగ్, శిక్షకులు వేణు, సతీష్, ప్రవల్లిక, మౌనిక, పవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● గరివిడిలోని ఫేకర్ ఫుట్‌బాల్ మైదానంలో విజయనగరం డీఎస్‌ఏ సౌజన్యంతో అథ్లెటిక్స్, వాలీబాల్ వేసవి శిక్షణా కార్యక్రమా లు నిర్వహిస్తున్నారు. నెలాఖరు వరకు శిబిరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

భోగాపురం, మే3(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏసీడీపీవో సత్యవతి తెలిపారు. శనివారంస్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిషోరీ వికాసం వేసవి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాల్య వివాహాలు, బాలికల్లో రక్తహీనతకు సంబంధించి తీసుకోవలిసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏవో కామేశ్వరరావు, డాక్టర్ దివ్య, ఎపీఎం జగదీష్ పాల్గొన్నారు.

● రేగిడి, మే 3(ఆంధ్రజ్యోతి): కిశోరీ బాలికలు ఆరోగ్యంతో పాటు సామజిక అంశాలపై ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని రాజాం ఐసీడీఎస్ ప్రాజెక్టు రేగిడి సెక్టార్ సుపర్‌వైజర్ సీహెచ్ నూకలమ్మ పేర్కొన్నారు. శనివారం మండలంలో చిన్నశిర్లాంలో కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా కిశోరీ బాలికలు చైతన్యం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాధ పాల్గొన్నారు.

చక్కెర పరిశ్రమ మూత పడకుండా చూడాలి

బొబ్బిలి రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): సంకిలి చక్కెర పరిశ్రమ మూత పడకుండా చూడాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం డిమండ్ చేశారు. శనివారం బొబ్బిలిలో ఆయన మాట్లాడారు. విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఉన్న లచ్చయ్యపేట, భీమసింగి చక్కెర పరిశ్రమలు మూత పడడంతో చెరకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంకిలి చక్కెర పరిశ్రమ మూసివేసి బీర్ కంపెనీ పెట్టాలని యాజమాన్యం చూస్తుందని, ప్రభుత్వం స్పందించి చక్కెర పరిశ్రమ నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమండ్ చేశారు. ఆయనతో రైతు సంఘం నాయకులు రెడ్డి త్రినాథ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు ఉన్నారు.

నెల్లిమర్లలో వార్డు సందర్శన

నెల్లిమర్ల, మే 3(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో వార్డు సందర్శనలో భాగంగా 1, 19, 20 వార్డుల్లో చైర్‌పర్సన్ బంగారు సరోజిని శనివారం పర్యటించారు. ఈసందర్భంగా రహదారులు, కాలువలు, మంచినీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. పలువురు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఆమె వెంట వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కమిషనర్ ఎ.తారకనాథ్, 1వ వార్డు కౌన్సిలర్ కింతాడ కళావతి, 19వ వార్డు కౌన్సిలర్ తుమ్మ భారతి, కోఆప్షన్ మెంబర్ కుమారి, మాత సంధ్య తదితరులు ఉన్నారు.

కేంద్రానిదే రాజధాని నిర్మాణ బాధ్యత

రాజాం, మే 3 (ఆంధ్రజ్యోతి): నూతన రాజధాని నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వంపై ఉందని రాజాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పునర్విభజన చట్టం-94(3) సెక్షన్ ప్రకారం నూతన రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పన కేంద్ర కల్పించాల్సిఉందని పేర్కొన్నారు. ప్రధాని నంరేంద్ర మోదీ 2015లో మట్టి కొట్టారు, నేడు సన్నం కొట్టి వెళ్లారని తెలిపారు. పదేళ్ల కిందట ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తీరని దోహం చేశారని ఆరోపించారు.

గాలి వీస్తే విద్యుత్ కట్

● భామినిలో నిత్యం అంధకారం


సెల్‌లైట్లతో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

భామిని, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏ మాత్రం వాతావరణం మారి చిన్న గాలి వీచినా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో భామినిలో నిత్యం అంధకారం నెలకొంటుంది. శనివారం సాయంత్రం 4 గంటలకు చిరుగాలులు వేయడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. రాత్రి 8 గంటల వరకు పవర్ ఇవ్వలేదు. దీంతో చీకట్లు అలముకున్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో సెల్‌ఫోన్ టార్చ్ వెలుతురులో తహసీల్దార్ రికార్డులు పరిశీలించారు. గురువారం రాత్రి 8.30 గంటలకు వర్షం పడడంతో ఆ రోజు రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోజు విడిచి రోజు వాతావరణం పేరిట విద్యుత్‌ను నిలిపి వేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం జరిగిన అంతరాయంపై ట్రాన్స్ ఏఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. గాలికి అనంతగిరి సమీపంలో 33 కేవీ విద్యుత్ లైన్లపై వెదురు కర్రలు పడిపోయాయని, తొలగించిన వెంటనే విద్యుత్ సరఫరా చేసినట్లు తెలిపారు.

శ్యామలాంబ పండగకు ఏర్పాట్లు


నాయుడువీధిలో సిద్ధమవుతున్న అమ్మవారి సిరిమాను

సాలూరు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): సాలూరు శ్యామలాంబ అమ్మవారి పండగకు జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు ఈ పండగ జరగనుంది. సుమారు 15 ఏళ్ల అనంతరం పండగ జరుగుతుం డడంతో నిర్వహణ కమిటీ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తుంది. దీనికోసం మంత్రి సంధ్యారాణి సాలూరు మున్సిపాలిటీకి రూ.2 కోట్ల నిధులు రప్పించారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా 52 విద్యుత్ స్తంభాలు, 12 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. శ్యామలాంబ ఆలయానికి రంగులు వేస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. వెయ్యిమంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించడానికి కార్యాచరణ చేస్తున్నారు.

సిరిమాను వెళ్లే మార్గంలో ఆక్రమణలు తొలగిస్తాం

సాలూరు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): సాలూరులో శ్యామలాంబ పండగ నేపథ్యంలో సిరిమాను నడిపే మార్గంలో ఆక్రమణలు తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ బీటీవీ కృష్ణారావు తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సిరిమాను మార్గంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మున్సిపాలిటీకి రూ.2కోట్ల నిధులు తీసుకొచ్చారని, ఆ నిధులతో తాగునీటికి ఇబ్బందులు లేకుండా 45 పైలెట్ వాటర్ స్కీంలు నిర్మిస్తున్నామని తెలిపారు. కుళాయిల ద్వారా రెండు పూటల తాగునీటి సరఫరాకు ప్రయత్నిస్తామన్నారు. అలాగే ఇతర మున్సిపాలిటీల నుంచి కూడా ట్యాంకర్లు తెప్పించి తాగునీటి సరఫరా చేస్తామన్నారు. 50 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఇతర ప్రాంతాల నుంచి కార్మికులు

సాలూరు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): సాలూరు శ్యామలాంబ పండగలో పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేస్తున్నట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ చెప్పారు. మున్సిపాలిటీలో మొత్తం 119 మంది కార్మికులు ఉన్నారని, వీరితో పాటు అదనంగా మరో 40 మంది కార్మి కులను పది రోజులకు కాంట్రాక్టుపై తాత్కాలికంగా ఇతర ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నామని ఆయన తెలిపారు.

పార్కింగ్ ప్రదేశాల పరిశీలన

శ్యామలాంబ పండగ రోజుల్లో పట్టణంలోకి వాహనాల రాకపోకలు సాగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు శనివారం సాలూరులో పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు సీఐ అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ బీటీవీ కృష్ణారావులు పరిశీలించారు. ఈ మేరకు కేవీఆర్ ఎస్టేట్, ముత్యాలమ్మ గుడి, బంగారమ్మకాలనీ తదితర ప్రాంతాల్లో వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసేందుకు గుర్తించారు.

రేపు నగర పంచాయతీ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ

పాలకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఆకుల మల్లీశ్వరి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజు శనివారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

● స్థానిక నగర పంచాయతీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఆకుల మల్లీశ్వరి, కుమార్ దంపతులను శనివారం పాలకొండలోని తమ స్వగృహంలోని రెల్లి ఉపకులాల రాష్ట్ర అధ్యక్షుడు గండి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రెల్లి ఉపకులాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చు దుర్గారావు, రెల్లికుల సంఘ నాయకులు ఎస్.మోహన్‌కుమార్, ఎం.ప్రకాష్, జోజి తదితరులు పాల్గొన్నారు.

పండగ రోజున సమ్మె

సాలూరు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): వామపక్షాలు, ప్రజా సంఘాలు ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్తలో తాము కూడా పాల్గొంటామని స్థానిక మున్సిపల్ కార్మికులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావేటి బాలకృష్ణకు శనివారం నోటీసును అందించారు. అయితే అదే రోజు శ్యామలాంబ సిరిమానోత్సవం ఉండడంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి పరిస్థితిని చర్చించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

పాలకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్.హిమప్రభ కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక సీడీపీవో శిమ్మాలమ్మకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ జీవో నెం-8ను మార్పు చేయాలని కోరారు. పింఛన్, పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని, వేసవి సెలవులు ఇవ్వాలని డిమండ్ చేశారు. బాలసంజీవిని యాప్‌లో మార్పులు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జెస్సీబాయి, టి.లక్ష్మి, ఎం.శ్రీదేవి, మణికుమారి, శ్యామల ఉన్నారు.

శిష్టకరణ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా రుద్రకోటేశ్వరరావు

పాలకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): శిష్టకరణ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పాలకొండ పట్టణానికి చెందిన సదాశివుని రుద్ర కోటేశ్వరరావు నియమితులయ్యారు. రాజమండ్రి పట్టణంలో శనివారం నిర్వహించిన శిష్టకరణ సంక్షేమ సంఘం సమావేశంలో నూతన కమిటీని నియమించారు. ఇందులో రుద్రకోటేశ్వరరావును ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నట్టు కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈసందర్భంగా పాలకొండ పట్టణ శిష్టకరణాలు పలువురు రుద్రకోటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఆధునిక సాగు పద్ధతులపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.భరత్‌లక్ష్మి సూచించారు. శనివారం గిజబ గ్రామంలో రస్తాకుంటుబాయి కేవీకే ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ కృషిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎగుమతులకు అనువుగా ఉండే పంటలు పండిస్తే లాభాలు సాధించవచ్చునన్నారు. కేవీకే సమన్వయకర్త డా.ఎస్.ధృవ, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

పాలకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): మహిళల చేతిలో పాశుపతాస్త్రం శక్తి యాప్ అని ఏఎస్‌ఐ పి.సురేష్‌కుమార్, హెచ్‌సీ బాబ్జీరావు, ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ ప్రకృతాంబ, పీసీలు అశోక్, దయాకర్‌లు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలు, చిన్నారుల భద్రత, రక్షణ కోసం పోలీస్‌శాఖ కొత్తగా ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. అనంతరం పట్టణంలోని వెంకటరాయుని కోనేరు గట్టుపై గంజాయి, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.

ఉపాధి పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

గరుగుబిల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో మంజూరైన ఉపాధి పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఉపాధి సహాయ పథక సంచాలకుడు గుంట్రెడ్డి శ్రీహరి రావు హెచ్చరించారు. మండలంలోని పలు పంచాయతీల్లో ఆయన శనివారం పర్యటించి, ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడారు. సీతంపేట క్లస్టర్ పరిధిలో 3,265 ఫాంపాండ్లను లక్ష్యంగా విధించామని చెప్పారు. మండలంలో గుర్తించిన చెరువు గట్లుపై కొబ్బరి మొక్కల పెంపకంపై ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్లస్టర్ పరిధిలో 1200 ఎకరాల్లో పలు రకాల పంటల సాగుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. వీటితో పాటు 15 కిలోమీటర్ల పరిధిలో రహదారికి ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీవో ఎం.గౌరీనాథ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గంట అవినాష్, టెక్నికల్ అసిస్టెంట్ ఎం.శ్రీహరి ఉన్నారు.

శ్రీరామమూర్తికి నివాళి

బెలగాం, మే 3 (ఆంధ్రజ్యోతి): కార్మిక, రైతాంగ వర్గానికి వెన్నుదన్నుగా నిలస్తూ, ప్రజా ఉద్యమాల కోసం నిరంతరం శ్రమించిన కమ్యూనిస్టు వైతాళికుడు రెడ్డి శ్రీరామమూర్తి అని సీపీఎం నాయకులు అన్నారు. శనివారం స్థానిక ఎన్జీవో హోంలో శ్రీరామమూర్తి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. శ్రీరామమూర్తి స్ఫూర్తితో పేద, బడుగుబలహీన వర్గాలకు అండగా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు రెడ్డి శ్రీదేవి, తిరుపతిరావు, కె.సుబ్బారావమ్మ, మన్మధరావు, కొల్లి సాంబ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి కోదండరాముని కల్యాణోత్సవాలు

గరుగుబిల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలోని కోదండరామస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 8న నుంచి నిర్వహించనున్నటు ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 8న సాయంత్రం 6.30 గంటల నుంచి కల్యాణోత్సవాలు ప్రారంభమై 12వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

సొంత నిధులతో విద్యుత్ సౌకర్యం

జియ్యమ్మవలస, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయండి అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు కొన్ని నెలల కిందట పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ఆయన మాటలు స్ఫూర్తిగా తీసుకుని ఒక సామాన్యుడు తనవంతు గ్రామాభివృద్ధికి తోడ్పడ్డాడు. కన్నపుదొరవలస గ్రామానికి చెందిన బంటు సతీష్ అనే టీడీపీ కార్యకర్త తన సొంత ఖర్చుతో ఆ గ్రామ దళితవాడకు విద్యుత్ సౌకర్యం అందిద్దామని ఆలోచించాడు. ఆలోచనే తడవుగా విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి తెలియజేసి, సహకారం అందించాలని కోరాడు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జగదీశ్వరి విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఆమె వంతు సహాయ సహకారాన్ని అందించడంతో తన సొంత ఖర్చులతో పనులు చకచకా చేయించాడు. ఈ దళితవాడలో ఇళ్లపై నుంచి విద్యుత్ వైర్లు ఉన్నాయి. దీంతో మొత్తం ఏడు స్తంభాలను లైన్ సిఫ్టింగ్ చేశారు.

ఆత్మగౌరవ ర్యాలీని జయప్రదం చేయండి

కురుపాం రూరల్, మే3 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో ఈనెల 7వ తేదీన జరగబోయే ఆత్మగౌరవ ర్యాలీని జయప్రదం చేయాలని ట్రైబుల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణారావు కోరారు. ఈమేరకు ఆయన శనివారం మొండెంఖల్ గ్రామంలో సమావేశం ఏర్పాటుచేశారు. పా ర్టీలకు అతీతంగా అన్ని వర్గాలవారు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

● గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం మొండెంఖల్ గ్రామంలో బుధవారం మే 7వ తేదీన పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, ఆదివాసీ, ఉపాధ్యాయ సంఘాల ర్యాలీని విజయవంతం చేయాలని ట్రైబుల్ రైట్స్‌ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణారావు కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉపాధ్యాయ, ఉద్యోగాల ప్రకటనలో గిరిజనులకు నష్టం కలుగుతుంద న్నారు. మెగా డీఎస్సీలో ఆదివాసీ బిడ్డలకు నష్టం వస్తుందన్నారు. జీవో నెం.3కు బదులుగా కొత్త జీవో తీసుకురావాలన్నారు.

గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్

సీతంపేట రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలో మలేరియా హైరిస్క్ గ్రామాలుగా గుర్తించిన గిరిజన గ్రామాల్లో 5శాతం ఏసీఎం ద్రావణాన్ని పిచికారీ చేశారు. దోనుబాయి పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు మలేరియా సబ్‌యూనిట్ అధికారి జె.మోహనరావు తెలిపారు. ఎంపీహెచ్‌వో రాజారావు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు. ● కురుపాం రూరల్: గిరిజన ప్రాంతాల్లో మలేరియా రాకుండా ముందస్తు చర్యగా స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. మొండెంఖల్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుమ్మ గ్రామంలో చేపట్టిన స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు శనివారం పరిశీలించారు.

ఈదురు గాలుల బీభత్సం


గరుగుబిల్లి: సొంబన్నవలసలో కురుస్తున్న వర్షం

మక్కువ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు చోట్ల వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ వైర్లపై చెట్టుకొమ్మలు ఎగిరి పడ్డాయి. రహదారిపై మురుగునీరు ప్రవహించడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఈదురుగాలుల ప్రభావం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరారం ఏర్పడింది. ● గరుగుబిల్లి: మండలంలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఈ వర్షాలతో నువ్వు పంట రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ● సాలూరు రూరల్: సాలూరు ఏజెన్సీలో శనివారం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారింది. ● భామిని: అకాల వర్షాలతో అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. గురండి ప్రాంతంలో వరి పంట కోత దశకు వచ్చినా వర్షాల కారణం గా వాయిదా వేసుకున్నారు. ఈదురుగాలుల వల్ల వరిచేలు నేలమట్టం కావడంతో మళ్లీ వర్షాలు కురిస్తే ధాన్యం కూడా నేలమట్టం అవు తుందని శనివారం ఆదరాబాద రాగా యం త్రాలతో సేకరించారు. మొక్కజొన్న గింజలను ఇళ్ల ముందు ఆరేస్తున్నారు.

100 సీసీ కెమెరాల వితరణ


ఎస్పీకి సీసీ కెమెరాలను అందజేస్తున్న దృశ్యం

బెలగాం, మే 3 (ఆంధ్రజ్యోతి): కొరికాన ఫౌండేషన్ పోలీసు శాఖకు 100 సీసీ కెమెరాలను వితరణ చేసింది. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డికి కొరికాన ఫౌండేషన్ అధినేత కొరికాన రవి వీటిని అందజేశారు. రూ.4 లక్షల విలువ గల ఈ సీసీ కెమెరాలను పాలకొండ పట్టణంలో ఏర్పాటు చేయాలని కోరారు. పాలకొండ డీఎస్పీ రాంబాబు, సీఐ చంద్రమౌళి, ఏఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఎస్సీ యువతకు స్వయం ఉపాధి పథకాలు

మక్కువ, మే 3 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల కార్యాచరణ ప్రణాళిక 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ యువతకు స్వయం ఉపాధి పథకాల కోసం ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో డీడీ స్వరూపారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహిక ఎస్సీ నిరుద్యోగ యువతీయువకులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 10న సాయంత్రం ఐదు లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నవధాన్యాల కిట్లు వినియోగించుకోండి

జియ్యమ్మవలస, మే 3 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాల కిట్లును ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బొంగు సురేష్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన బిత్రపాడు, ఎం.అల్లువాడ రైతుసేవా కేంద్రాల్లో నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్, స్టేట్ రిసోర్స్‌పర్సన్ పి.దేవుళ్లు, ఏవో జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

జియ్యమ్మవలస, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్ల స్థలం లేని వారందరూ దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎన్.చిన్నారావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గతంలో ఇళ్ల స్థలం పొందనివారు అర్హులన్నారు. ఆధార్, రైస్ కార్డులు ఉండాలన్నారు. మూడెకరాల కంటే ఎక్కువ పల్లపు భూమి, 10 ఎకరాల కంటే ఎక్కువ మెట్టు భూమి ఉండరాదని తెలిపారు. అర్హులు గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లాగిన్‌లో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హత్యాయత్నానికి పాల్పడినవారిని అరెస్టు చేయాలి

పాలకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): వంగర జడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శనరావుపై హత్యా యత్నానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదన్నారు. ఇలాంటి దాడులు జరగడం బాధాకరమన్నారు.

సీతంపేట ఎంపీడీవోగా బీబీ మిస్రో

సీతంపేట రూరల్,మే 3(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఎంపీడీవోగా బీబీ మిశ్రో పదోన్నతిపై ఇక్కడకు రానున్నారు. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన బీబీ మిశ్రోకు సీతంపేట ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన సోమవారం సీతంపేట ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

మక్కువ, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీ భవనానికి శనివారం పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. 23,972 నోట్‌పుస్తకాలు, 16,759 పాఠ్యపుస్తకాలు మండలానికి సంబంధించి వచ్చాయని, వీటిని పాఠశాలల పునఃప్రారంభం అనంతరం బయోమెట్రిక్ ఆధారంగా విద్యార్థులకు పంపిణీ చేస్తామని ఎంఈవోలు పెంట సత్యనారాయణ, పి.శ్యాం సుందరరావు తెలిపారు.

కురసంగిలో వైద్య శిబిరం

సీతంపేట రూరల్,మే 3(ఆంధ్రజ్యోతి): కురసింగి గ్రామంలో మలేరియా జ్వరాలు ఎక్కువగా ఉండడంపై 'మంచం పట్టిన కురసింగి' పేరిట శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం కుసిమి పీహెచ్‌సీ వైద్యాధికారి శివశంకర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు.